క్లుప్తంగా

పెంచిన పెన్షన్ అందజేత



వృద్ధురాలికి పింఛన్ అందజేస్తున్న కర్రి రాజేష్

మహారాణిపేట : వైఎస్సార్ పెన్షన్ కానుక కార్యక్రమం గురువారం జీవీఎంసీ 37వ వార్డు జోన్-4లో జరిగింది. ఈ సందర్భంగా జబ్బర్‌తోట సచివాలయం పరిధిలో వృద్ధురాలికి వార్డు సంక్షేమ, అభివృద్ధి కార్యదర్శి కర్రి రాజేష్ పింఛన్ అందజేశారు. ఈ కార్యక్రమంలో వార్డు వలంటీర్ నక్క దుర్గా తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ మహిళ సావిత్రిబాయి పూలే



ఉపాధ్యాయులను సత్కరిస్తున్న కోలా గురువులు, రామన్నపాత్రుడు

దాబాగార్డెన్స్ : తొలితరం ఉపాధ్యాయురాలు, సంఘ సంస్కర్త సావిత్రిబాయి పూలే నేటి సమాజానికి ఆదర్శప్రాయులని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు పేర్కొన్నారు. పూలే జయంతిని పురస్కరించుకుని గురువారం ఎంవీడీ హైస్కూల్లో పలువురు ఉపాధ్యాయులను ఆయన సత్కరించారు. ఆంధ్రప్రదేశ్ బీసీ సంఘం ఉపాధ్యక్షుడు, ఏపీ అయ్యారక కార్పొరేషన్ డైరెక్టర్ కె. రామన్నపాత్రుడు నేతృత్వంలో నిర్వహించిన కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ కోడూరు అప్పలరత్నం, పార్టీ నాయకుడు పెంటపల్లి సత్యనారాయణ, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రేణుక యల్లమ్మ ఆలయంలో అన్న సమారాధన



అన్నసమారాధనలో పాల్గొన్న వనపర్తి సుబ్బారావు దంపతులు

అల్లిపురం : కెప్టెన్ రామారావు జంక్షన్‌లో వెలసిన రేణుక యల్లమ్మ అమ్మవారి ఆలయంలో గురువారం అన్నసమారాధన నిర్వహించారు. ప్రముఖ న్యాయవాది వనపర్తి సుబ్బారావు, గాయత్రి దంపతుల వివాహ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఈ కార్యక్రమం చేపట్టారు. ముందుగా ఆలయ అర్చకుడు కొడమంచిలి కామేశ్వరశర్మ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. అనంతరం నిరుపేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ గౌరవ అధ్యక్షుడు పీలా వెంకట అప్పలనాయుడు, అధ్యక్షుడు కర్రి నీలకంఠం, కార్యదర్శి బొడ్డు పోలారావు, ఆలయ ముఖ్య సలహాదారు బొడ్డేటి ప్రసాద్ పాల్గొన్నారు.

నేడు ఉపాధి కార్యాలయంలో జాబ్‌మేళా

కంచరపాలెం: స్థానిక జిల్లా ఉపాధి కార్యాలయం నేషనల్ కెరీర్ సర్వీస్ సెంటర్‌లో శుక్రవారం మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారులు సిహెచ్.సుబ్బిరెడ్డి (క్లరికల్), శాంతి (టెక్నికల్) ఒక ప్రకటనలో తెలిపారు. వేదాంత గ్లోబల్ కార్పొరేషన్, స్పైడ్ కార్పొరేషన్, హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్ ఇన్సూరెన్స్, ముత్తూట్ ఫైనాన్స్, ఆర్‌ఏఎస్ టెక్నాలజీస్, వీల్స్ మార్ట్, ఈ జోన్ సెక్యూరిటీ సొల్యూషన్స్, యాష్ స్టోర్స్, హెటిరో డ్రగ్స్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీల్లో 415 ఉద్యోగాల భర్తీకి ఇంటర్వ్యూలు జరుగుతాయన్నారు. ఆయా ఉద్యోగాలను బట్టి జీతం నెలకు రూ.16,000 నుంచి రూ.25,000 వరకు ఉంటుందన్నారు. ఆసక్తి గలవారు కంచరపాలెం జిల్లా ఉపాధి కార్యాలయంలో శుక్రవారం ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే జాబ్‌మేళాకు హాజరు కావాలని కోరారు.



35వ వార్డు జగనన్న సురక్షలో సేవలందించేందుకు సిద్ధంగా ఉన్న ఏఎన్‌ఎంలు



35వ వార్డులో రోగుల వివరాలు నమోదు చేస్తున్న డాటా ఎంట్రీ ఆపరేటర్లు



41వ వార్డు జగనన్న సురక్షలో మాట్లాడుతున్న కార్పొరేటర్ పూర్ణిమ

ప్రజారోగ్యానికి 'సురక్ష'

- రెండవ దఫా జగనన్న ఆరోగ్య సురక్షకు చక్కటి స్పందన
- 35వ వార్డులో 300 మందికి.. 41వ వార్డులో 135 మందికి వైద్య సేవలు

జగదాంబ : సంక్షేమ పాలనకు అసలైన అర్థమేమిటో నిరూపించిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా పేదల చెంతకే వైద్యాన్ని తీసుకొచ్చారు. పేద, మధ్య తరగతి ప్రజల కోసం రెండవ దఫా ఆరోగ్య సురక్ష కార్యక్రమం గురువారం జీవీఎంసీ 35వ వార్డు వెలంపేట సచివాలయం పరిధిలో నిర్వహించారు. డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య కేంద్రంలో జరిగిన ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున ప్రజలు తరలి వచ్చారు. గతంలో ఆరోగ్య పరీక్షలు, శస్త్ర చికిత్సలు



35వ వార్డులో రోగి వివరాలు నమోదు చేస్తున్న వైద్యాధికారి

చేయించుకున్న వారు మరోసారి పరీక్షలు చేయించుకున్నారు. అలాగే కొత్తగా వచ్చిన రోగులు కూడా వైద్యం చేయించుకున్నారు. వారికి సిబ్బంది



రోగులకు మందుల అందజేత

మందులు అందించారు. కొందరు రోగులకు అవసరాన్ని బట్టి మెరుగైన వైద్యం కోసం రిఫర్ చేశారు. వైద్య శిబిరంలో 300 మందికి పైగా రోగులు పరీక్షలు చేయించుకుని, వైద్యసేవలు పొందారు. ముగ్గురిని మెరుగైన వైద్యం కోసం వైద్యాధికారి డాక్టర్ సందేష్ కేజీహెచ్‌కు తరలించారు. ఈ శిబిరంలో 40 మంది కంటి పరీక్షలు చేయించుకున్నారు. వైద్యాధికారులు, ఏఎన్‌ఎంలు, గృహసారథులు, కన్వీనర్లు, తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఆరోగ్య భరోసా..

కంచరపాలెం : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పేద ప్రజల ఆరోగ్యానికి భరోసా ఇస్తోందని జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యురాలు, వార్డు కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ, జోన్-5 కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ అన్నారు. జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురం సచివాలయానికి సంబంధించి వైఎస్సార్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం(యూపీహెచ్‌సీ)లో గురువారం జరిగిన



41వ వార్డులో రక్త పరీక్ష చేస్తున్న వైద్య సిబ్బంది

రెండో విడత 'జగనన్న ఆరోగ్య సురక్ష' వైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. జీవీఎంసీ అధికారుల నేతృత్వంలో వైద్యాధికారులు పరీక్షలు నిర్వహించారు. సుమారు 135 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు యూపీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ వినీలా తెలిపారు. కార్యక్రమంలో పబ్లిక్ హెల్త్ ఏఎంహెచ్‌వో డాక్టర్ ఎ.సునీల్‌కుమార్, ఏపీడీ అధికారులు పద్మావతి, చిరంజీవి, క్లస్టర్ ఇన్‌చార్జి కోడిగుడ్ల శ్రీధర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, పార్టీ నాయకులు, సచివాలయ సిబ్బంది, ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు, వలంటీర్లు, కన్వీనర్లు, గృహసారథులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యానికి భరోసా కల్పించారు..



జగన్‌బాబు ఆరోగ్యానికి భరోసా కల్పించారు. చిన్నపాటి వైద్యం కూడా చేయించుకోలేని మాలాంటి వారెందరికో ఇలాంటి శిబిరాలు చక్కగా ఉపయోగపడతాయి. బీపీ, షుగర్ పరీక్షలు చేయించుకోవడానికి వచ్చాను.

– సోమరాజు, ప్రసాద్‌గార్డెన్స్, 35వ వార్డు

ఈ కార్యక్రమం ఇలాగే కొనసాగించాలి..



నేను రక్త పరీక్ష చేయించుకోవడానికి వచ్చాను. పేద ప్రజలకు ఉపయోగపడుతున్న పథకాలు పెడుతూ, కార్యక్రమాలు నిర్వహిస్తున్న సీఎం జగన్ వాటిని నిరంతరం కొనసాగించాలి. అప్పుడే పేదలకు మేలు జరుగుతుంది.

– కె.సన్యాసిరావు, పండావీధి, 35వ వార్డు

డాక్టర్లు, సిబ్బంది బాగా చూసుకున్నారు..



రెండవ దఫా ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించడం ఆనందంగా ఉంది. శిబిరంలో పరీక్షలు చేయించుకోవడానికి అవకాశం ఏర్పడింది. నాకు ఇక్కడ తనిఖీలు చేసి ఉచితంగా మందులు ఇచ్చారు. డాక్టర్లు, సిబ్బంది బాగా చూసుకున్నారు.

– ఎల్లమ్మ, వెలంపేట, 35వ వార్డు

వైద్య శిబిరంతో మేలు జరిగింది..



గతంలో ఏ ఆరోగ్య సమస్య వచ్చినా కుటుంబ సభ్యులను ప్రైవేటు ఆస్పత్రుల చుట్టూ తిప్పేవాళ్లం. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా నేడు మా ప్రాంతాల్లో మెడికల్ క్యాంపులు నిర్వహించి, ఎప్పటికప్పుడు ఆరోగ్య పరీక్షలు చేయడం, మందులివ్వడం ఎంతో ఆనందంగా ఉంది.

– కుమార్, స్లీప్‌గుర్తువీధి, జ్ఞానాపురం

పేదలకు ప్రయోజనకరం..



మాకు సమీపంలోనే వైద్య సేవలు అందించడం చాలా సంతోషంగా ఉంది. మొదటి విడతలో అన్ని పరీక్షలు చేయించుకున్నాను. అప్పుడు ఉచితంగా మందులు అందించారు. అవి ఇప్పటి వరకు వచ్చాయి. ఖరీదైన మందులు ఉచితంగా అందజేస్తున్నారు. ఇటువంటి వైద్య శిబిరాలు పేదలకు ప్రయోజనకరంగా ఉంటాయి.

– పైడమ్మ, జ్ఞానాపురం,

పుష్ప, వస్త్రాలంకరణలో కన్యకాపరమేశ్వరి



పుష్ప, వస్త్రాలంకరణలో కన్యకాపరమేశ్వరి



సామూహిక కుంకుమ పూజల్లో పాల్గొన్న మహిళలు

దాబాగార్డెన్స్ : మార్గశిర మాసోత్సవాల్లో భాగంగా పాతనగరం కురుపాం మార్కెట్ సమీపాన గల కన్యకా పరమేశ్వరి ఆలయంలో నాల్గో గురువారాన్ని పురస్కరించుకుని అమ్మవారు పుష్ప, వస్త్రాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి 108 సువర్ణ పుష్పాలతో ప్రత్యేక పూజ జరిపారు. ప్రధాన అర్చకుడు బీబీ కుమార్ శర్మ నేతృత్వంలో సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో దేవాలయ సంఘం అధ్యక్షుడు ఆరిశెట్టి దినకర్, కార్యదర్శి గ్రంధి రామకృష్ణారావు, కోశాధికారి సుగ్గు శివకుమార్, ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్ పాలూరి వరప్రసాద్, సలహాదారులు కొల్లూరు రాము, బొడ్డు రఘు, నల్లూరి నూకరాజు, పెనుగొండ కామరాజు, పాలూరి వర్ధనబాబు పాల్గొన్నారు.

అలరించిన సంగీత విభావరి

దాబాగార్డెన్స్ : స్వరగీతిక, శారదా స్వర సంగమం సంయుక్త ఆధ్వర్యంలో గురువారం అల్లూరి విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన సినీ సంగీత విభావరి అలరించింది. ఆయా సంస్థల అధినేతలు రాజారావు, లోకేష్ సారథ్యంలో అందగాడా..నిండు చంద్రుడా...శీర్షికన నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని సోషల్ మీడియా స్టేట్ చైర్మన్ సన్‌మూర్తి, శ్యాంసుందర్, మంజుల పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు గాయకులు ఆలపించిన సినీ గీతాలు అలరించాయి. కార్యక్రమంలో డాక్టర్ కేఎల్ రావు, రాజారావు, శ్రీదేవి, లోకేష్, లావణ్య, కందర్పరాధ, శ్యాంసుందర్, బొమ్మిడి సత్యనారాయణ, జిలాని, మాధురి తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో శారీరక, మానసికోల్లాసం

దాబాగార్డెన్స్ : క్రీడలు శారీరక, మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని శ్రీకాశ్యప్ డిగ్రీ, జూనియర్ కళాశాలల కరస్పాండెంట్ టీఆర్‌ఎస్ వర్మ పేర్కొన్నారు. విద్యా సంస్థల స్పోర్ట్స్ మీట్ గురువారం నగరంలోని పోలీస్ బ్యారెక్స్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీకాశ్యప్ కళాశాల ప్రతి ఏటా స్పోర్ట్స్ మీట్ నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన క్రికెట్, త్రోబాల్, ఖోఖో, అథ్లెటిక్స్, షటిల్ బ్యాడ్మింటన్, కబడ్డీతో పాటు చెస్, క్యారమ్స్ పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డైరెక్టర్ ఎస్. నారాయణమూర్తి, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎల్. జ్యోత్స్నరెడ్డి, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ పి. సత్యనారాయణ, ఫిజికల్ డైరెక్టర్ బీఎస్ రవి, స్టూడెంట్స్ స్పోర్ట్స్ సెక్రటరీ జి. శ్రీనివాస్, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.



అధ్యాపకులతో క్రీడా విజేతలు

కనకమహాలక్ష్మికి విశేష పూజలు



అమ్మవారికి పూజలు చేస్తున్న మహిళలు



దాబాగార్డెన్స్: మార్గశిర మాసోత్సవాలలో భాగంగా కనకమహాలక్ష్మి అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిగాయి. పెద్ద ఎత్తున భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు.

మహాన్నదానం..

టౌన్‌కొత్తరోడ్డులోని జగన్నాథస్వామి ఆలయం వద్ద 5 వేల మంది భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం ఆలయ ప్రాంగణం వద్ద నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. డీఎంహెచ్‌వో ఆదేశాల మేరకు భక్తుల సౌకర్యార్థం వైద్య శిబిరం నిర్వహించి ఉచిత వైద్య సేవలందించారు.

ట్రాఫిక్ మళ్లింపు..

నగరం నుంచి పాతపోస్టాఫీస్ వెళ్లే ఆర్టీసీ బస్సులతో పాటు ఇతర వాహనాలను టౌన్‌కొత్తరోడ్డు జంక్షన్ ముందు వీధి (సీబీఎం హైస్కూల్.. హెడ్ పోస్టాఫీస్.. కర్రలదొడ్డి) నుంచి జీవీఎంసీ సూయిజ్‌ఫాం.. పోర్టు జంక్షన్.. పద్మానగర్ లక్ష్మీటాకీస్ మీదుగా వన్‌టౌన్ రాణిబొమ్మ వైపు మళ్లించారు.

నేటి కార్యక్రమాలు..

మార్గశిర మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం 5 నుంచి 6 గంటల వరకు పంచామృతాభిషేకం, అమ్మవారికి సహస్ర నామార్చన, ఉదయం 6 నుంచి 11 గంటల వరకు సర్వదర్శనం, ఉదయం 11.30 నుంచి 12 గంటల వరకు అమ్మవారికి పంచామృతాభిషేకం, 12 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు సర్వదర్శనం, సాయంత్రం 6 నుంచి 7 గంటల వరకు విశేష పంచామృతాభిషేకం, అష్టోత్తర నామార్చన పూజ నిర్వహిస్తారని ఈవో శిరీష తెలిపారు.

అమ్మవారిని దర్శించుకున్న మోపిదేవి..

అల్లిపురం : కనకమహాలక్ష్మి అమ్మవారిని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణ దంపతులు గురువారం దర్శించుకున్నారు. ఆయనకు



మోపిదేవి దంపతులకు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఈవో శిరీష



మేయర్ దంపతులకు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఈవో శిరీష

ఆలయ అర్చకులతో కలిసి ఈవో కె.శిరీష స్వాగతం పలికారు. అమ్మవారికి మోపిదేవి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ మండపంలో మోపిదేవి దంపతులకు వేద పండితులు ఆశీర్వచనాలు అందజేశారు. ఈవో శిరీష వారికి అమ్మవారి చిత్రపటం, ప్రసాదం అందజేశారు.

అమ్మవారి సన్నిధిలో మేయర్ దంపతులు..

కనకమహాలక్ష్మి అమ్మవారిని మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, శ్రీనివాస్ దంపతులు గురువారం దర్శించుకున్నారు. వారికి ఆలయ ఈవో కె.శిరీష స్వాగతం పలికారు. మేయర్ దంపతులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. వారికి వేద పండితులు ఆశీర్వచనాలు అందజేశారు. ఈవో శిరీష వారికి అమ్మవారి చిత్రపటం, ప్రసాదం అందజేశారు.

పిల్లల వ్యాధులపై సమీక్ష



కేజీహెచ్‌లో వైద్యులతో సమావేశమైన కేసలి అప్పారావు, గొండు సీతారామ్

మహారాణిపేట : పిల్లలు ఎదుర్కొంటున్న వివిధ అరుదైన వ్యాధులపై గురువారం కేజీహెచ్‌లో పిల్లల వైద్యులతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ (ఏపీఎస్సీపీసీఆర్) చైర్‌పర్సన్ కేసలి అప్పారావు, సభ్యులు గొండు సీతారాం సమీక్ష నిర్వహించారు. పిల్లల వార్డులో పర్యటించి తల్లిదండ్రులతో మాట్లాడి వివిధ దీర్ఘకాలిక, అరుదైన వ్యాధులపై సమాచారం సేకరించారు. బ్రెయిన్ ఫీవర్‌తో గత రెండేళ్లలో మరణించిన పిల్లల వివరాలు తెలుసుకున్నారు. వంశపారంపర్యంగా సంక్రమించే ఎన్ని వ్యాధులను గుర్తించారు, వీటి చికిత్సకు పేద పిల్లలొస్తే అధిక మొత్తం ఖర్చుతో కూడుకున్న ఇంజెక్షన్లు ప్రభుత్వం ఉచితంగా సరఫరా చేస్తోందా, ఇలా గత రెండేళ్లలో ఎంత మందికి చేశారని ప్రశ్నించారు. దీంతో పాటు పిల్లలకు అందజేస్తున్న వైద్యం, ఇతర సదుపాయాలపై ఆరా తీశారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అశోక్‌కుమార్, జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ ఎం.ఆర్.ఎల్.రాధ, ఐ.సి.డి.ఎస్.ప్రాజెక్ట్ డైరెక్టర్ వెంకటేశ్వరి, జిల్లా ప్రొబేషనరీ అధికారి ఎం.శరత్, సి.డి.పి.ఓ. శ్రీలత, జిల్లా బాలల సంరక్షణ అధికారి లక్ష్మి, పి.ఓ.ఐ.సి.రమేష్, వన్ స్టాప్ సెంటర్ ప్రతినిధి శరణ్య తదితరులు పాల్గొన్నారు.

కథా నాటిక పోటీలు ప్రారంభం



ప్రసంగిస్తున్న ఏపీ ఇండియన్ మెడికల్ అసోసియేషన్ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి డాక్టర్ రవికృష్ణ



శిథిల జీవి నాటికలో ఓ సన్నివేశం

మద్దిలపాలెం : అజో-విభో-కందాళం, రైటర్స్ అకాడమీ సంయుక్తంగా మద్దిలపాలెం కళాభారతి వేదికగా నిర్వహిస్తున్న కథా నాటిక పోటీలు గురువారం ప్రారంభమయ్యాయి. తొలి రోజు కార్యక్రమానికి ఆహ్వాన సంఘం కన్వీనర్ డాక్టర్ డి.ఎస్.ఎన్.మూర్తి స్వాగత ఉపన్యాసంతో శ్రీకారం చుట్టారు. అనంతరం ఆత్మీయ అతిథి నంద్యాలకు చెందిన కళారాధన సంస్కృతిక సంస్థ, ఏపీ ఇండియన్ మెడికల్ అసోసియేషన్ వ్యవస్థాపక కార్యదర్శి డాక్టర్ జి.వి.రవికృష్ణ మాట్లాడుతూ కథలను నాటకాలుగా మార్చడంలో కంధాల ఫౌండేషన్ చేస్తున్న కృషి ప్రశంసనీయమన్నారు. కథలు, నాటకాలు పుస్తకాల రూపంలో తీసుకువచ్చిన సంస్థలను ఆయన అభినందించారు. చాలా ఏళ్ల క్రితం తాను రాసిన మాధవ సేవ కథను నాటిక పోటీలలో ప్రదర్శించడానికి అవకాశం కల్పించిన నిర్వాహకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. రైటర్స్ అకాడమీ చైర్మన్ వి.వి.రమణమూర్తి మాట్లాడుతూ నాటకాలను ప్రోత్సహించడంలో ఎప్పుడూ ముందుంటామన్నారు.

ఆకట్టుకున్న శిథిల జీవి నాటిక

నాటిక పోటీలలో తొలి ప్రదర్శనగా శిథిల జీవి నాటిక ప్రేక్షకుల హృదయాలను కదిలించింది. పల్లెలో ఓ పేద కుటుంబం జీవన తీరును కళాకారులు కళ్లకు కట్టినట్టుగా ప్రదర్శించి ప్రశంసలు పొందారు. అనంతరం ప్రముఖ రంగస్థల నటి ఆలపాటి లక్ష్మికి రంగస్థల సేవా మూర్తి జీవితకాల సాధన పురస్కారంతో పాటు రూ.10 వేలు నగదు అందించి సత్కరించారు.

బుల్లయ్య కళాశాలలో సైన్స్ ఫెస్ట్

సీతంపేట: డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కళాశాల స్వర్ణోత్సవం సందర్భంగా డిగ్రీ, పీజీ విద్యార్థులు గురువారం నిర్వహించిన సైన్స్ ఫెస్ట్ విశేషంగా ఆకట్టుకుంది. విద్యార్థులు ప్రదర్శించిన సాంకేతిక ప్రదర్శనలు, నమూనాలు వారి ప్రతిభకు అద్దం పట్టాయి. వివిధ కళాశాలలు, పాఠశాలల విద్యార్థులను ఆహ్వానించి వారు తయారు చేసిన నమూనాల్లో ఇమిడి ఉన్న సాంకేతికత, ప్రయోజనాలను, మానవ జీవితానికి ఏ విధంగా ఉపయోగపడతాయో వివరించారు. కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ జి.మధుకుమార్, బి.మాధవి, బ్రహ్మానందరెడ్డి సైన్స్ నమూనాలకు తిలకించి విద్యార్థులను అభినందించారు.

రోడ్డు ప్రమాదాల కట్టడికి చర్యలు



బిర్లా జంక్షన్‌లో మైక్ సెట్ ద్వారా మాట్లాడుతున్న ట్రాఫిక్ ఏసీపీ రాజీవ్‌కుమార్

మర్రిపాలెం: రోడ్డు ప్రమాదాల కట్టడికి, ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు కంచరపాలెం ట్రాఫిక్ పోలీసులు చర్యలు చేపట్టారు. హర్ష హీరో అధినేతలు, పాత్ర ఇండియా, హుండాయ్ కార్ల కంపెనీ వారి సౌజన్యంతో ప్రధాన కూడళ్లలో పబ్లిక్ అడ్రస్ సిస్టం మైక్ సెట్లు ఏర్పాటు చేశారు. గురువారం ఈ మైక్ సెట్లను జోన్-2 ట్రాఫిక్ ఏసీపీ రాజీవ్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ రహదారిపై తాటిచెట్లపాలెం, కంచరపాలెం, బిర్లా, ఎన్‌ఏడీ జంక్షన్లలో పబ్లిక్ అడ్రస్ సిస్టమ్స్(మైక్ సెట్) ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ముఖ్యంగా ట్రాఫిక్ నిబంధనలను వివరిస్తూ ట్రాఫిక్ క్రమబద్ధీకరించడానికి, రోడ్డు ప్రమాదాలు నివారించేందుకు ఈ మైక్ సెట్లు ఎంతో ఉపయోగపడతాయన్నారు. మైక్ సెట్లు అందజేసిన ప్రతినిధులు సురేష్, భార్గవ్, చరణ్‌లను ఏసీపీ అభినందించారు. కార్యక్రమంలో కంచరపాలెం ట్రాఫిక్ సీఐ మళ్ల అప్పారావు, సిబ్బంది పాల్గొన్నారు.